RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ | సంపుటి : 01 | సంచిక : 124 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజీలు : 4 | వెల రూ. 2 | సోమవారం -14 - సెప్టెంబర్ - 2026

Published From : Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

ఎర్ర సముద్ర తీరంలో వేగంగా బలపడుతున్న హౌతీ రెబల్స్

కీలకమైన మోఖా పోర్టు, పెరిమ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న హౌతీలు

డ్రోన్ దాడులతో సౌదీ తూర్పు-పశ్చిమ పైప్‌లైన్ మూసివేత

సౌదీ చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం, తగ్గిన సరఫరా

అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటిన ముడిచమురు ధరలు

## భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం.. ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్



భారత్‌లో స్థిరపడాలనుకున్న ఐర్లాండ్ వ్యక్తికి గ్రోక్ ఏఐ సమాధానం

పౌరసత్వానికి 12 ఏళ్ల నివాసం తప్పనిసరి అని వెల్లడి

ఈ సంభాషణపై 'ఇండియా ఈజ్ రియలిస్టిక్' అని స్పందించిన ఎలాన్ మస్క్



## ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?

- స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం
- ఏడు దశల్లో వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబూ?
- దీనిని ఏ విధంగా న్యాయమైనది, పారదర్శకమైనది అని అనగలం?
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు



- డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై జగన్ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్
- రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానిస్తున్నారని విమర్శ
- బాక్సర్ పెద్ద అప్పలరాజు నేషనల్ ఛాంపియన్ అని వెల్లడి
- ఆధారంగా సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన లోకేశ్

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

## వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కేంద్రం

- ★ అమరావతిలో క్వాంటమ్ బయో వ్యాలీ
- ★ జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- ★ ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం ఎన్డీయే
- ★ 'ఎక్స్'లో నడ్డాకు సీఎం కృతజ్ఞతలు



అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం. మిగతా 2 లో



## వైసీపీలో కీలక మార్పులు.. పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్

వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తల పదవుల్లో మార్పులు

వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలకు కీలక బాధ్యతలు

రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా జిరక సురేంద్రబాబు

డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా పోరాట కమిటీ ఏర్పాటు

న్యాయ పోరాటం కోసం ప్రత్యేకంగా లీగల్ సెల్ నియామకం

అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

## శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు

- మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది
- నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు
- ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దు



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం మిగతా 2 లో

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు

## బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తాం: సీఎం

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తా



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం మిగతా 2 లో

## అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు

# బోను సిద్ధంగా ఉంది

## 22ఏ ఉమ్మడి రాష్ట్రం నుంచే అమల్లో ఉంది.. కొత్తగా పెట్టింది కాదు

- ధరణి పేరుతో భూముల దోపిడీ
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగుచూసిన ఆధారాలు
- మేం నిషేధిత జాబితాలో ఒక్క ఎకరానూ కొత్తగా చేర్చలేదు
- ఇళ్లు నిర్మించుకుని దీర్ఘకాలికంగా ఉంటున్న వారిపై త్వరలో విధాన నిర్ణయం
- శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి




హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి మిగతా 2 లో



## నందిగ్రామ్‌లో పోటీ చేయండి.. మా అభ్యర్థి ఉండరు మమతకు రెబల్స్ ఆఫర్

- నందిగ్రామ్ ఉపఎన్నికలో మమతపై పోటీకి దూరంగా ఉంటామన్న టీఎంసీ రెబల్స్
- ఆమె పోటీ చేస్తే తమ అభ్యర్థిని నిలబెట్టబోమని స్పష్టం చేసిన తిరుగుబాటు వర్గం
- మమత కూడా అసెంబ్లీలో ఉండాలని కోరుకుంటున్నామన్న విపక్ష నేత శీతబ్రత బెనర్జీ
- సువేందు అధికారి రాజీనామాతో నందిగ్రామ్‌కు ఉపఎన్నిక

## 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు



- అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి అబద్ధాలు
- మా మామపై మాట్లాడింది కూడా అసత్యాలే
- నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌వోసీ ఇచ్చిన భూమినే మా మామ కొన్నారు
- పొంగులేటి భూబాగోతాన్ని బయటపెడుతున్నందుకే నాపై, నా కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# సౌదీ అరేబియాకు షాక్.. ఎర్ర సముద్ర మార్గానికీ హౌతీల ముప్పు

ఢిల్లీ: సౌదీ అరేబియా తన చమురు ఎగుమతుల విషయంలో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, మరోవైపు ఇరాకీ మిలిటెంట్ల డ్రోన్ దాడులతో పాటు తాజాగా యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో పట్టు బిగించడం రియాద్‌ను ఇరకాటంలోకి నెట్టింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన రెండు ప్రధాన మార్గాలు ఏకకాలంలో ప్రమాదంలో పడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ మద్దతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవలి కాలంలో ఎర్ర సముద్ర తీరంలో వేగంగా ముందుకు సాగుతున్నారు. కొన్ని రోజుల క్రితం కీలకమైన మోఖా ఓడరేవును, బాబ్ అల్-మండబ్ జలసంధికి సమీపంలో ఉన్న పెరిమ్ ద్వీపాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో ప్రపంచ చమురు, వాణిజ్య నౌకలకు అత్యంత ముఖ్యమైన బాబ్ అల్-మండబ్ జలసంధిపై వారి నియంత్రణ మరింత పెరిగింది. ఇదివరకు హర్మూజ్ జలసంధిలో సమస్యలు తలెత్తినప్పుడు, సౌదీ అరేబియా తన తూర్పు తీరంలోని చమురు క్షేత్రాల నుంచి ఎర్ర సముద్ర తీరానికి పైప్‌లైన్‌ల ద్వారా ముడి చమురును రవాణా చేసి ఎగుమతులు చేసేది. ఇప్పుడు ఆ మార్గానికే హౌతీల రూపంలో ముప్పు ఏర్పడింది. దీనికి తోడు, శుక్రవారం ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్లు డ్రోన్లతో దాడి చేయడంతో సౌదీ తన తూర్పు-పశ్చిమ పైప్‌లైన్‌ను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఈ డ్రోన్ దాడులకు హౌతీలు సహకరించారని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాల కారణంగా ఆసియా దేశాలకు సౌదీ చేసే చమురు ఎగుమతులు భారీగా పడిపోయాయి. జూన్‌లో రోజుకు 34 లక్షల బ్యారెళ్లుగా ఉన్న ఎగుమతులు, ఆగస్టు నాటికి కేవలం 1.28 లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. ఈ నెలలో కాస్త కోలుకుని రోజుకు 7 లక్షల బ్యారెళ్లకు చేరాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సౌదీ అరేబియా ముందున్న మార్గాలు పరిమితంగానే ఉన్నాయి. సైనిక చర్యకు దిగితే, వివాదం మరింత ముదిరి తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉంది. దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తే ఇరాన్, హౌతీల నుంచి కఠినమైన షరతులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు, ఈ విషయంలో అమెరికా మద్దతు కూడా అనిశ్చితంగానే ఉంది. పశ్చిమాసియాలో మరో యుద్ధంలో జోక్యం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుముఖంగా లేరని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరింది. తమ దేశాన్ని రక్షించుకోవడంతో పాటు, ఎర్ర సముద్రంలో నౌకాయాన స్వేచ్ఛను కాపాడేందుకు భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తామని సౌదీ అధికారులు తెలిపారు.

# భారత పౌరసత్వంపై గ్రోక్ సమాధానం.. ఎలాన్ మస్క్ వైరల్ కామెంట్

ఢిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ 'గ్రోక్' మరోసారి వార్తల్లో నిలిచింది. భారత్‌లో స్థిరపడాలనుకుంటున్న ఐర్లాండ్ పౌరుడొకరు అడిగిన ప్రశ్నకు గ్రోక్ ఇచ్చిన సమాధానం, దానికి ఎలాన్ మస్క్ జోడించిన వ్యాఖ్య ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఐర్లాండ్‌కు చెందిన ఒక వ్యక్తి తన భాగస్వామి, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రస్తుతం కోల్‌కతాలో నివసిస్తున్నారు. తాను భారత్‌లోనే శాశ్వతంగా స్థిరపడాలని భావిస్తున్నట్లు పేర్కొంటూ, భారత పౌరసత్వం పొందడానికి పట్టే సమయం గురించి ఆయన గ్రోక్‌ను ప్రశ్నించారు. దీనికి గ్రోక్ స్పందిస్తూ.. భారత సహజ పౌరసత్వం పొందాలంటే కనీసం 12 ఏళ్లపాటు ఇక్కడ చట్టబద్ధంగా నివసించాలని స్పష్టం చేసింది. దరఖాస్తు చేయడానికి ముందు గడిచిన 14 ఏళ్లలో 11 ఏళ్ల పాటు భారత్‌లో ఉండాలని, దరఖాస్తుకు ముందు చివరి ఏడాది మాత్రం నిరంతరంగా దేశంలోనే నివసించాలనే నిబంధన ఉందని వివరించింది. అంతేకాకుండా, భారత్ ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదని, భారత పౌరసత్వం కావాలంటే ఐర్లాండ్ పౌరసత్వాన్ని వదులుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. పౌరసత్వం మంజూరు అనేది పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుందని కూడా పేర్కొంది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను పీటర్ సెయింట్ ఓంజ్ అనే ఎక్స్ వినియోగదారుడు పంచుకోగా, దానిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. "×అఎఖు అం తీఘుశ్రీఅర్అషె" (భారత్ వాస్తవిక దృక్పథంతో ఉంది) అని వ్యాఖ్యానించారు. మస్క్ చేసిన ఈ చిన్న వ్యాఖ్య నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. మస్క్ వ్యాఖ్యలతో నెటిజన్లు ఏకీభవిస్తూ.. "భారత్ ఎప్పటి నుంచో వాస్తవికంగానే ఉంది", "భారత్ ఒక అద్భుతమైన దేశం" అంటూ కామెంట్లతో మద్దతు తెలుపుతున్నారు.

# రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు జగన్ కు నారా లోకేశ్ హితవు

అమరావతి: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గట్టిగా బదులిచ్చారు. రాజకీయ విమర్శల కోసం రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారుడిని అవమానించడం తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. "పెద్ద అప్పలరాజు ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్. ఆయన నేషనల్ ఛాంపియన్. ఆయన సెమీఫైనల్ వీడియోలు ఇప్పటికీ దూరదర్శన్‌లో ఉన్నాయి. రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించడం ఇప్పటికైనా ఆపండి జగన్ గారు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా బాక్సర్ అప్పలరాజు ఆడుతున్న పాత వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని జగన్ ఆరోపణలు చేస్తుండడం తెలిసిందే. నిన్న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల కోటాలో జరిగిన అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. అసలు జరగని క్రీడలకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, కొందరికి పరీక్ష కూడా నిర్వహించకుండానే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఆ తప్పుడు సర్టిఫికెట్లను ధ్రువీకరించింది, నియామకాలు జరిపింది కూడా వారేనని విమర్శించారు. ఈ విషయంపై అధికారులు కూడా సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారని, సమర్పించిన స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అసలైనవో కావో నిర్ధారించలేకపోతున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎందుకు స్పందించడం లేదని జగన్ ప్రశ్నించిన నేపథ్యంలో, తాజాగా లోకేశ్ ఓ వీడియో ఆధారంతో కౌంటర్ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నందిగ్రామ్‌లో పోటీ చేయండి.. మా అభ్యర్థి ఉండరు: మమతకు రెబల్స్ ఆఫర్

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికలో మమతా బెనర్జీ పోటీ చేస్తే, తాము అభ్యర్థిని నిలబెట్టబోమని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తిరుగుబాటు వర్గం ప్రకటించింది. "మేము కూడా మమతా బెనర్జీ అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నాము" అని రెబల్ వర్గం నేత, విపక్ష నాయకుడు రీతబ్రత బెనర్జీ పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేత సువేందు అధికారి భవానీపూర్, నందిగ్రామ్ రెండు స్థానాల్లోనూ గెలిచారు. భవానీపూర్‌లో మమతా బెనర్జీని ఓడించిన ఆయన, నందిగ్రామ్ స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల తర్వాత టీఎంసీలో ఏర్పడిన విభేదాలతో పలువురు ఎమ్మెల్యేలు రీతబ్రత బెనర్జీ నాయకత్వంలో తిరుగుబాటు వర్గంగా ఏర్పడ్డారు. శనివారం ఢిల్లీలో ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అనంతరం రీతబ్రత బెనర్జీ మీడియాతో మాట్లాడారు. తమ అభ్యర్థిని దాదాపు ఖరారు చేసుకున్నప్పటికీ, మమత పోటీ చేస్తే మాత్రం నిలబెట్టబోమని స్పష్టం చేశారు. "మమతా బెనర్జీ సాధారణ ఎన్నికల్లో గెలవరు, కానీ ఉపఎన్నికల్లో గెలుస్తారు. సొంత ప్రాంతంలో ఆమె ఓడిపోవడం బాగుండదు" అని వ్యాఖ్యానించారు. మరో రెబల్ నేత అఖ్రుజ్జమాన్ మాట్లాడుతూ "నందీగ్రామ్‌కు రండి. మేము అభ్యర్థిని నిలబెట్టం. గెలిచి అసెంబ్లీకి రండి. అభివృద్ధికి కలిసి పనిచేద్దాం" అని మమతకు పిలుపునిచ్చారు. అయితే, టీఎంసీ పార్టీ పేరు, గుర్తు కోసం ఈ రెండు వర్గాల మధ్య వివాదం ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోంది. ఈ ఆఫర్‌పై మమతా బెనర్జీ ఇంకా స్పందించలేదు. నందిగ్రామ్, రెజీనగర్ స్థానాలకు అక్టోబర్ 6న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 9న ఫలితాలు వెలువడనున్నాయి. నామినేషన్ల దాఖలుకు సెప్టెంబర్ 16 చివరి తేదీ.

# వైసీపీలో కీలక మార్పులు.. పలువురికి కొత్త బాధ్యతలు అప్పగించిన జగన్



అమరావతి: వైసీపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు నేతలకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రధానంగా ప్రాంతీయ సమన్వయకర్తల (రీజనల్ కోఆర్డినేటర్ల) నియామకాల్లో ఈ మార్పులు జరిగాయి. తాజా మార్పుల ప్రకారం.. ఎంపీ వై.వి. సుబ్బారెడ్డిని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించారు. గతంలో ఆయన కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను పర్యవేక్షించేవారు. మరో ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి ప్రకాశం జిల్లాల సమన్వయ బాధ్యతలను అప్పగించారు. ఇక మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఉమ్మడి నెల్లూరు జిల్లా బాధ్యతలకు పరిమితం చేశారు. ఇదే క్రమంలో బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన బీరక సురేంద్రబాబును రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమించారు. వీటితో పాటు డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న అభ్యర్థులకు అండగా నిలిచేందుకు ఒక పోరాట కమిటీని, న్యాయపోరాటం కోసం లీగల్ సెల్‌ను కూడా జగన్ ఏర్పాటు చేశారు. డీఎస్సీ పోరాట కమిటీలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తమడం కల్పలత, పానుగంటి చైతన్య, రవిచంద్ర ఉండగా.. లీగల్ సెల్‌లో పొన్నవోలు సుధాకర్ రెడ్డి, మలసాని మనోహర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జీవీఎస్ కిషోర్‌లను సభ్యులుగా నియమించారు.

# అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు భోను సిద్ధంగా ఉంది

హైదరాబాద్: 'ధరణి పోర్టల్ పేరుతో గత పాలకులు ప్రభుత్వ భూముల దోపిడీకి పాల్పడ్డారు. నిషేధిత జాబితాలోని భూములను కొద్ది సమయంపాటు తొలగించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని తిరిగి ఆ జాబితాలో పెట్టేవారు. ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తే దోపిడీకి సంబంధించి భయంకరమైన ఆధారాలు దొరికాయి. 13 వేల ఖాతాలకు 23 లక్షల ఎకరాల ఆస్తిని బదిలీ చేసినట్లు వెలుగు చూసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీ నుంచే నిషేధిత జాబితా(22ఏ) అమల్లో ఉందని.. భారాస పాలకులు పదేళ్లలో ఆ జాబితాలో ఉన్న పేదల భూములు తొలగించలేదని విమర్శించారు. హైకోర్టు ఆదేశాలతోనే 2025లో ప్రభుత్వం 22ఏ జాబితాను అప్‌లోడ్ చేసిందని.. న్యాయస్థానం 45 రోజుల సమయమే ఇవ్వడంతో ధరణి, అంతకుముందు నవీకరించని జాబితానే కలెక్టర్లు అప్‌లోడ్ చేయడంతో సమస్య ఏర్పడిందని చెప్పారు. ఆ పొరపాటును సరిదిద్దామన్నారు. శాసనసభలో శనివారం 22ఏ అంశంపై జరిగిన చర్చలో ఆయన 3 గంటల 47 నిమిషాలపాటు ప్రసంగించారు. ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టులోని వివరాలను సభ ముందుంచారు. హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు దుష్ప్రచారం చేశారంటూ వీడియో క్లిప్పింగ్స్‌ను సభలో ప్రదర్శించారు. మంత్రి ఏమన్నారంటే.. 'ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌ను 1999లో రిజిస్ట్రేషన్ చేయడంతో నాటి ప్రభుత్వం 22ఏ చట్టం అమల్లోకి తెచ్చింది. 2015న ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 22ఏలో ఏ నుంచి ఈ వరకు సబ్ సెక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2025లోనూ ధర్మాసనం ఆదేశించి 45 రోజుల గడువు ఇచ్చింది. తక్కువ సమయం ఉండటంతో పాత డేటా అప్‌లోడ్ అయింది. దీంతో సమస్యలు రాగా సరిదిద్దాం. విలువైన ఆస్తులను ఎలా కొల్లగొట్టవచ్చో మాస్టర్ స్కెచ్ వేసి ధరణి తీసుకొచ్చారు. వారి తొత్తైన టెరాసిస్ అనే విదేశీ సంస్థకు 2.49 కోట్ల ఎకరాల భూములను తాకట్టు పెట్టారు. ఆ సంస్థ నుంచి భూములు మరో సంస్థకు బదిలీ అయ్యాయి. అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు చేశారు. అందుకే 2024 డిసెంబరు 1న భూ భారతిని ఎన్ఐసీకి అప్పగించాం. ఇప్పటికీ టెర్రాసిస్ నిర్వాహకులు భూ భారతిలోకి రెండుసార్లు ప్రవేశించారు. మొదటిసారి రిజిస్ట్రేషన్ ఫీజులు దారిమళ్లించారు. ఎస్ఈటీ ఏర్పాటుకు ముందు భూ భారతిలో ప్రవేశించి 50 ఎకరాల ఎసైన్డ్ భూములు బదిలీ చేశారు. దానిని గుర్తించాం. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా వారే అధికారంలో ఉన్నట్లు పేదల ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తున్నారు. అటువంటి ఆలోచనలు మానుకోండి. లేదంటే ఫలితాలు కొద్ది రోజుల్లో అనుభవిస్తారని హెచ్చరిస్తున్నాం. హైదరాబాద్‌లో సీఎస్ 7, 13, 14లకు సంబంధించి హరీశ్‌రావు వక్రీకరించి మాట్లాడుతున్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లను జాబితా నుంచి తొలగించాలని సీఎంను కోరారు. ఆ భూములు ఉమ్మడి ఏపీ నుంచే జాబితాలో ఉన్నాయి. ఖరీదైన ఈ భూముల రుచి చూసిన ఓ పెద్ద మనిషి గతంలో ఒక బెంజ్‌కారు పొందారు. మనిషి రక్తం రుచిచూసిన పులిలా.. అదే ధ్యాసలో ఉన్నారు. కానీ, రేవంత్‌రెడ్డి అనే బోను ఉందని మర్చిపోయారు. ముకుతాడు వేసి కట్టేస్తాడని తెలిసి నిద్రపట్టని రాత్రులు గడుపుతున్నారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ జటిలమైన ఇలాంటి సమస్యలు ఎందుకు పరిష్కరించలేదు. ధరణిలో లావాదేవీలకు, తొలగింపు భూములకు లెక్కా పత్రం లేదు. భూ భారతిలో పక్కా లెక్కలు ఉన్నాయి. వారి పాలనలో 22ఏ నుంచి తొలగించిన 23 వేల ఎకరాలకు పత్రాలు లేవు. రాష్ట్రంలో ఎసైన్డ్, యూఎల్‌సీ తదితర భూముల్లో నివాసాలు ఉన్న ప్రాంతాలపై త్వరలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నాం. భువనగిరి, మంచిర్యాలలో ఏళ్ల నుంచి ఎసైన్డ్ భూముల్లో ఇళ్లున్నాయి. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగానూ ఉన్నాయి. మేం నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క ఎకరా చేర్చలేదు. ఎసైన్డ్, యూఎల్‌సీ సమస్యలపై విధాన పరమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారం అనుభవించిన వాళ్లు ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారు. మీరు కదా రాజీనామా చేయాల్సింది. నేను ప్రతి నెలా ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, టవర్స్ నిర్మాణంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నా. నన్ను రాజీనామా చేయాలంటారా? ఇప్పటి వరకు రూ.21 కోట్లు తీసుకుని సభకు మొహం చాటేసిన కేసీఆర్ చేయాలి. అధికారంలో ఉంటే అవినీతి, ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్ వ్యవహారం మీది' అని మంత్రి పొంగులేటి విరుచుకుపడ్డారు.

# పంచ సూత్రాల రాజధానిగా అమరావతి

అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చింది. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించి చర్చించుకునే రోజు వస్తుంది. పంచ సూత్రాల రాజధానిగా అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. నో పోల్ సిటీగా.. బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలతో స్మార్ట్ వర్క్ చేసి గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. ఏఐ రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు యువతకు శిక్షణ ఇస్తున్నాం.

దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికత, జీవశాస్త్ర పరిశోధనల కలయికతో 'అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ'ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేయబోయే ఈ ప్రాజెక్ట్ దేశ ఆరోగ్య, పరిశోధనా రంగానికి సరికొత్త దిక్సూచిగా మారనుందని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, ప్రయోగశాలల ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీలను ఒకే వేదికపైకి తేవడమే ఈ క్వాంటమ్ బయో వ్యాలీ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దీన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు. ప్రపంచ బయో ఎకానమీలో 111 మిలియన్ డాలర్ల వాటాతో ఆంధ్రప్రదేశ్ టాప్ 5లో ఉందని.. రాబోయే పదేళ్లలో గ్లోబల్ బయో ఎకానమీ పవర్‌హౌస్‌గా మారుతుందని చెప్పారు. విజయవాడలో జరిగిన క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ముఖ్యాంశాలివీ.. 'రూ.249 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల ప్రారంభంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం మరింత చేరువవుతుంది. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలతో పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దేశంలో వైద్యవిద్య సీట్లను 51 వేల నుంచి రెండింతలకు పైగా పెంచారు. కొవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుంది. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయి. ఆయుష్మాన్‌భారత్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఫార్మా రంగానికి ఏపీ చిరునామాగా మారింది. మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ 1గా నిలుపుతాం.

## స్మార్ట్ వర్క్‌తో ఒత్తిడి దూరం

వంట గదినే ఫార్మసీగా.. ఆహారాన్నే ఔషధంగా మార్చుకోవాలి. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటివి నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి. ఒత్తిడిని దూరం చేసుకుని స్మార్ట్ వర్క్ చేయాలి. సంప్రదాయ ఆరోగ్య విధానాలను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలం. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు. నడ్డా నాయకత్వంలో దేశప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్న నమ్మకం ఉంది.

రామాయణంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్నే తీసుకొచ్చినట్లు.. పేదల ముంగిటకే అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానాన్ని సంజీవని రూపంలో తెస్తున్నాం. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. వ్యాధుల ముందస్తు అంచనా, నివారణ, చికిత్స, వైద్య ఖర్చులు తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

అమరావతి క్వాంటమ్ బయో వ్యాలీ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తామని, సంజీవని ఆరోగ్య కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు చేసే అంశం పరిశీలిస్తామని ప్రకటించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ధన్యవాదాలు తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు ప్రారంభించేందుకు విజయవాడలో మాతో కలిసినందుకు ధన్యవాదాలు. ప్రధాని మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ఎన్డీయే ప్రభుత్వం ఆరోగ్య, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది' అని పేర్కొన్నారు.

# 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు



హైదరాబాద్: అసెంబ్లీ సాక్షిగా 22ఏపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని అసెంబ్లీలో భారాస డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి, ఆయన కుమారుడు చేస్తున్న భూబాగోతాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నాననే కక్షతో.. తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో శనివారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొందరపడి నిషేధిత జాబితాలో పెట్టిన ఇళ్లను, భూములను ఎంత వేగంగా ఆ జాబితా నుంచి తొలగిస్తారో మంత్రి సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. "22ఏ విషయంలో తప్పు జరిగిందని పొంగులేటి అసెంబ్లీలో అంగీకరించారు... అది అభినందనీయమే. ఆయన క్షమాపణ చెబుతారని ప్రజలు ఆశించారు. ఇదంతా తమ హయాంలో జరగలేదు.. గతంలోనే నిషేధిత జాబితాలో ఉందని బుకాయించే ప్రయత్నం చేశారు. గతంలో సమస్య ఉంటే.. అప్పుడెందుకు రిజిస్ట్రేషన్లు ఆగలేదు... ఇప్పుడు ఎందుకు ఆగాయి? ప్రజలు ఎందుకు రోడ్ల మీదకు వచ్చారు? తప్పే జరగకపోతే.. మీరెందుకు ఇటీవల సారీ చెప్పారు? అధికారుల మీదకు నెట్టేసే ప్రయత్నం ఎందుకు చేశారు? భూభారతి వెబ్‌సైట్‌లోకి ఎవరో ప్రవేశించారని.. ఎసైన్డ్ భూములు, పట్టా భూములు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు అయిపోతున్నాయని మీరు అంగీకరించారు. భూభారతిని అత్యంత పకడ్బందీగా రూపొందిస్తే అలా ఎలా జరుగుతుంది? రిజిస్ట్రేషన్ చలాన్లలో అవకతవకలను బయటపెట్టిందే భారాస. ఆ స్కాంలో అధికారుల మీద చర్యలు తీసుకోకుండా ఆపరేటర్లపై తీసుకొని మిన్నకుండిపోయారు" అని హరీశ్ అన్నారు. "మా మామ ఒక భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అది అవాస్తవం. ఆయన ఒక రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి. ఒక రిటైర్డ్ ఆర్మీ అధికారికి 1995లో అప్పటి ప్రభుత్వం భూమి కేటాయించింది. 2010లో కాంగ్రెస్ సర్కారు హయాంలోనే ఆ భూమికి ఎన్‌వోసీ ఇచ్చింది. దాని ఆధారంగా ఆ భూమిని మా మామ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమి ఇప్పుడు ఎకరం రూ.15 కోట్లు ఉంటుందంటున్నారు మంత్రి... రూ.50 లక్షలకు ఇస్తాం రిజిస్ట్రేషన్ చేసుకోండి" అని హరీశ్ అన్నారు. "పొంగులేటి మాపై మరో అబద్ధం చెప్పారు. మా భూమి మిషన్ భగీరథలో పోతే.. డబ్బులు తీసుకున్నానన్నారు. కానీ ఆ భూమి గోదావరి సుజల స్రవంతి పథకంలో భాగంగా పోయింది. చెక్ ఇచ్చింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. 2011లో మ్యుటేషన్ కూడా జరిగింది" అని వివరించారు.

# 14న తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం శ్రీనివాసుడి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ పరిసరాల్లో, తిరువీధుల్లో విహరించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అదేరోజు వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణ నడుమ భూమిపూజ చేసి, పుట్టమట్టి సేకరించి, యాగశాలలోని కొత్తపాలికల్లో నవధాన్యాలు పోసి అంకురార్పణ చేయనున్నారు. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు నిర్వహించనున్నారు. 19న రాత్రి గరుడ సేవను అర్ధరాత్రి వరకూ కొనసాగిస్తారు. 20న సాయంత్రం స్వర్ణ రథోత్సవం, 22న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంతో వాహనసేవలు ముగియనున్నాయి. 23న ఉదయం 6 గంటల నుంచి పుష్కరిణిలో చక్రస్నానం ఉంటుంది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను తితిదే రద్దుచేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ పరిధిలో ఉండి, స్వయంగా వచ్చేవారికి పరిమితం చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, దాతలకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది.

## గవర్నర్‌కు తితిదే ఆహ్వానం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రావాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు తితిదే ఆహ్వానం పలికింది. ఈవో ముద్దాడ రవిచంద్ర, వేద పండితుల బృందం శనివారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి బ్రహ్మోత్సవాల వివరాలను తెలిపింది. ఆహ్వాన పత్రికను గవర్నర్‌కు ఈవో అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు.

# కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్ల ఏర్పాటు



హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో సమావేశమై బీసీలకు సంబంధించిన పలు సమస్యలను సీఎంకు వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరగా ఈ అంశంపై సీఎం సానుకూలంగా స్పందించారని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని బీసీ సంక్షేమ శాఖను ఆదేశించినట్లు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో, పలు జిల్లా కేంద్రాల్లో బీసీ విద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 120 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని ,హాస్టల్ విద్యార్థుల కోసం శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేయగా కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా దశలవారీగా చెల్లిస్తామని చెప్పారన్నారు. సీఎంను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జి.మల్లేష్‌యాదవ్, నీలా వెంకటేష్, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, పర్లగోర్ల మోడీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా?



అమరావతి: డీఎస్సీ నియామక ప్రక్రియలో ఏడు దశల వెరిఫికేషన్ అంటే ఇదేనా చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఏపీ మెగా డీఎస్సీ స్కామ్‌పై ఆయన మరోసారి 'ఎక్స్' వేదికగా చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'వెరిఫికేషన్.. నో, నో.. ఏడు దశల వెరిఫికేషన్' అంటూ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏడు దశలు పెట్టినా.. ఒక్కో కేసులో ఒక్కో అంశం బయటపడుతోందని చెప్పారు. వెరిఫికేషన్ పేరుతో అసలేం సాధించారంటూ నిలదీశారు. ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుతో చంద్రబాబు సర్కారు ఆటలాడుతోందని అన్నారు. ఉపాధ్యాయ అభ్యర్థుల కెరీర్లు మీకు అపహాస్యంగా మారాయా అని మండిపడ్డారు. 'ముందుగా విజేతల జాబితాను పరిశీలిస్తే అందులో సంబంధిత అభ్యర్థుల పేర్లు కనిపించడంలేదు. ఆ తర్వాత ఖోఖో అధికారులను సంప్రదిస్తే.. సర్టిఫికెట్ నకిలీదని తేలింది. అంతేకాకుండా నాగార్జున యూనివర్సిటీని సంప్రదిస్తే.. అసలు ఆ క్రీడా కార్యక్రమమే జరగలేదని తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీ ప్రక్రియను న్యాయమైన, పారదర్శకమైన నియామక ప్రక్రియగా ఎలా పిలుస్తారు? ఇది స్కామ్ కాదా? దీనికి మీరు నైతిక బాధ్యత వహించరెందుకు' అని వైఎస్ జగన్ సీఎం చంద్రబాబుని నిలదీశారు.

స్కిల్ కేసులో క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం

చంద్రబాబు చేసిన స్కామ్‌లో ఆయనే సొంతంగా క్లీన్ చిట్ ఇప్పించుకుని భుజాలు ఎగరేసుకుయిటున్నారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఫేస్‌బుక్‌లో ఈమేరకు ఒక పోస్టు చేశారు. 'అధికారులను బెదిరించి తనపై ఉన్న కేసుల పని పూర్తి చేసుకుని క్లీన్‌చిట్ అని చెప్పడం దౌర్భాగ్యం. తన మీద కేసులు తానే కొట్టేయించుకుంటున్నాడు. ఎందుకంటే అవన్నీ నిజం కాబట్టి. ఇప్పుడు కూడా డీఎస్సీ కేస్‌ని నిర్వీర్యం చేసే పని చేస్తున్నాడు. అయినా స్కిల్ కేసులో తనకు క్లీన్‌చిట్ వచ్చిందని చెప్పుకోవడం ఎంతటి దౌర్భాగ్యం' అని వైఎస్ జగన్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

## కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో పేషెంట్ లక్ష్మి ఆరోగ్యం మెరుగు.. తమిళనాడు నుండి వచ్చి తల్లిని అక్కున చేర్చుకున్న కుమారుడు




కడప మహి న్యూస్ , సెప్టెంబర్ 13: కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మి అనే పేషెంట్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. రోడ్డు పక్కన మానసిక అనారోగ్యంతో ఉన్న లక్ష్మిని రిస్క్ టీం వారు తమ అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ మానసిక వైద్యశాలలో చేర్పించారు. అక్కడ వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆమె ఆరోగ్యాన్ని మెరుగుపరిచారు. మానసిక ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత లక్ష్మి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే తమిళనాడు నుండి ఆమె ఇద్దరు కుమారులు కడప రిమ్స్ కు చేరుకున్నారు. తల్లిని చూడగానే ఉద్వేగానికి గురైన కుమారులు తల్లిని అక్కున చేర్చుకున్నారు. ఆ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. అనంతరం ఆసుపత్రి వర్గాలు పేషెంట్ లక్ష్మిని కుమారులకు, కుటుంబ సభ్యులకు అధికారికంగా అప్పగించారు. పేషెంట్ బాధ్యతను తాము తీసుకుంటామని తిరువల్లూర్ నుండి వచ్చిన వెంకటేష్ కుమారులు లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మనోబంధు ఫౌండేషన్ వారికి, రిమ్స్ మానసిక వైద్యశాల వైద్యులకు, సిబ్బందికి చేతులెత్తి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.




## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి..!!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: శ్రీ గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, సంప్రదాయం, ఆత్మీయతలతో వినాయక చవితి వేడుకలను ఆనందంగా నిర్వహించుకోవాలని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పొరుగువారితో కలిసి సోదరభావంతో పండుగ జరుపుకోవాలని కోరారు. పండుగ వేళ ప్రజల భద్రత, ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ చిన్నారులు, వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోరారు. నీటి వనరులు కలుషితం కాకుండా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను నివారించాలని సూచించారు. మన భక్తి ప్రకృతికి భారం కాకుండా, భవిష్యత్ తరాలకు మేలు చేసేలా ఉత్సవాలను నిర్వహించడమే నిజమైన పండుగ స్ఫూర్తి అన్నారు. గణనాథుని కృపతో జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సిరిసంపదలు, ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం నెలకొనాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజల ఐక్యత, భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన సహకారంతో వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## కొత్తపల్లిలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభం

### పెద్దముడియం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/పెద్దముడియం, మహి న్యూస్ సెప్టెంబర్ 13 : పెద్దముడియం మండలంలోని ఉలవపల్లె, కొత్తపల్లి గ్రామాల్లో జమ్మలమడుగు శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి, కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులతో మాట్లాడి పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో సుమారు రూ. 8.50 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను ఇరువురు కలిసి ప్రారంభించారు. పాఠశాల భద్రత, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడంలో ప్రహరీ గోడ ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జయసింహారెడ్డి, డీకే కొండారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీడీపీలోకి 100 కుటుంబాలు

### ఉలవపల్లె, కొత్తపల్లె గ్రామాల నుంచి పార్టీలో చేరికలు.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమన్న భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/పెద్దముడియం, మహి న్యూస్ సెప్టెంబర్ 13: పెద్దముడియం మండలం ఉలవపల్లె గ్రామానికి చెందిన ఈదుల రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉలవపల్లె, కొత్తపల్లె గ్రామాలకు చెందిన సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కడప పార్లమెంట్ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పెద్ద సంఖ్యలో కుటుంబాలు తెలుగుదేశం పార్టీ కుటుంబంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని భూపేష్ సుబ్బరామిరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



### పార్టీలో చేరిన వారిలో..

కళావతి (మాజీ సర్పంచ్), పద్మావతి, స్వర్ణలత, నరసింహారెడ్డి, బీరం కొండారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దానం, సంపత్, సుధాకర్, పుల్లారెడ్డి, దేవదాసు, పవన్, సునీల్, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, గంగుల నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చిన్నబి, దివాకర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం..!

### ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పి ఓ పి) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ




కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని కోటి రెడ్డి సర్కిల్ సమీపంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, పర్యావరణహిత వినాయక చవితి వేడుకలపై అవగాహన కల్పించారు.

### "మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం."

ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ శ్రీమతి సుధా కురుబా మాట్లాడుతూ, సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మరియు రసాయనిక రంగుల వినియోగం వల్ల నిమజ్జనం అనంతరం జలవనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా




ప్రజలు పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మట్టి విగ్రహాలను పూజించి, సహజసిద్ధమైన పద్ధతుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పండుగల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు. "మన పండుగ -- మన బాధ్యత, మట్టి వినాయకుడు -- పర్యావరణానికి మేలు" అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప సిబ్బంది, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్

### ఒక్క రోజులో 92,091 కేసుల పరిష్కారం.. రూ. 22.11 కోట్లకు పైగా పరిహారం చెల్లింపు

కడప, మహి న్యూస్ । సెప్టెంబర్ 13: జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో వైఎస్సార్ కడప జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. సెప్టెంబర్ 12న జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 29 ధర్మాసనాల ద్వారా 92,091 కేసులను పరిష్కరించారు. పరిష్కరించిన కేసుల్లో 91,236 క్రిమినల్ కేసులు, 201 సివిల్ కేసులు, 654 ముందస్తు వ్యాజ్య కేసులు ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారంలో భాగంగా మొత్తం రూ. 22,11,42,448 కక్షిదారులకు చెల్లించారు.

ప్రాంతాల వారీగా పరిష్కరించిన కేసులు



కడప - 6,788
ప్రొద్దుటూరు, మైదుకూరు - 13,627
రాజంపేట - 6,622
రాయచోటి - 3,483
బద్వేల్ - 5,989
జమ్మలమడుగు - 13,164
సిద్ధవటం - 3,714
రైల్వేకోడూరు - 6,074
పులివెందుల - 9,292
నందలూరు - 6,040
లక్కిరెడ్డిపల్లి - 11,240
కమలాపురం - 6,058

జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించి, పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఇతర అధికారులు, కక్షిదారులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్, అలాగే సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

## వెలిగల్లు ప్రాజెక్టు నీటిలో వినాయకుడిని నిమజ్జనం నిషేధం

### పర్యావరణ పరిరక్షణ,నీటి కాలుష్యం నివారణ కు అధికారులు సూచన.



గాలివీడు: సెప్టెంబర్13 (మహి న్యూస్ ): వినాయక చవితి సందర్భంగా వెలిగల్లు ప్రాజెక్టు రిజర్వాయర్లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయడాన్ని అధికారులను నిషేధించినట్లు ప్రాజెక్ట్ ఏఈ తెలిపారు. ప్రాజెక్ట్ నీరు ప్రజల అవసరాలకు వినియోగిస్తున్న నేపథ్యంలో నీటి కాలుష్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహాల తయారీలో ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయన రంగులు పూజా సామాగ్రి నీటిలో కలవడం వల్ల నీటి నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రజల్లో నిబంధనలను పాటిస్తూ నిర్దేశించిన ప్రదేశాల్లోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు వెలిగల్లు ప్రాజెక్టు నీటిలో నిమజ్జనం చేయకుండా భక్తులు సహకరించాలని అధికారులు కోరారు నిషేధిత ప్రాంతంలో విగ్రహ నిమజ్జనం చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుని అవకాశం ఉందని హెచ్చరించారు పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రాజెక్టు నీటి స్వచ్ఛతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## ఎర్రబల్లె కొత్తపల్లిలో స్థల వివాదం

### ఇరు వర్గాల మధ్య ఘర్షణ, నలుగురికి తీవ్ర గాయాలు



కమలాపురం మహి న్యూస్ సెప్టెంబర్ 13.: కమలాపురం మండలం ఎర్రబల్లె కొత్తపల్లి గ్రామంలో స్థల వివాదం ఘర్షణకు దారి తీసింది. తమకు కేటాయించిన స్థలంలో బాత్రూం నిర్మాణం చేపట్టడమే వివాదానికి కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో తమ స్థలాల వద్దకు వచ్చి దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో జయరాజు, బాల నరసింహులు, ఓబులేసు, అజయ్ అనే నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కడప రిమ్స్ కు తరలించారు. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అవతలి వర్గంలో కూడా ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పరిస్థితి అదుపులో ఉన్నట్లు సమాచారం.

## నేడు (14న) పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవు..!

### జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 13: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈనెల 14న సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో జిల్లా వ్యాప్తంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు.

## జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు



మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబరు 13: ఈ నెల 14న సోమవారం "వినాయక చవితి" పర్వదినం సందర్భంగా... సర్వ విఘ్నాలను తొలగించి.. సకల శుభాలను ప్రసాదించే ఆ మహా గణపతి... జిల్లా ప్రజలందరికీ పరిపూర్ణమైన ఆయుఃరారోగ్యాలను, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని... ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు జిల్లాపై ఎల్లవేళలా ఉండాలని.. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా ప్రజలకు హృదయ పూర్వకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వినాయక చవితి పర్వదినం ప్రతి ఒక్కరికి అత్యంత ఇష్టమైన భక్తి పూర్వకమైన పండుగ. ఆ మహాగణాధిపతి ప్రతి ఒక్కరి విఘ్నాలను తొలగించి సంతోషాన్ని, ఆనందాన్ని అందించాలని.. జిల్లా ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా సంక్షేమం.. సౌభాగ్యం వెల్లివిరియాలి



రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 13: ఈ నెల 14న నిర్వహించుకోనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇల్లు సంక్షేమం, సౌభాగ్యం, సంతోషాలతో శోభాయమానంగా వెలుగొందాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలని కోరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంతృప్తికర స్థాయిలో అందేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.

## అదనపు పొగాకు కొనుగోళ్ల అనుమతి కోసం ప్రయత్నిస్తా..

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్.



ఏలూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 13: పొగాకు రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నానన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు ఆదివారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను ఏలూరులోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు మార్కెట్ గత నాలుగు నెలలుగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందని, ప్రస్తుతం మార్కెట్ ధరలు రోజురోజుకూ మెరుగుపడి ఇప్పుడు యార్డులో పొగాకు ధర కేజీ 345 వరకూ చేరిందని చెబుతూ, ఇందు కోసం ఎంపీ గారు చేసిన కృషిని రైతులు ప్రశంసించారు. కొద్ది రోజుల్లో పొగాకు ధర మరికొంత పెరుగుతుందన్న ఎంపీ, దీనికోసం పొగాకు బోర్డుతో, కంపెనీల ప్రతినిధులతో తాను మాట్లాడుతున్నానని తెలిపారు. అయితే రైతులు కూడా బోర్డు అనుమతి లేకుండా పొగాకు సాగు చేయవద్దని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

### అదనంగా పండిన పొగాకు అమ్మకాలకు అనుమతి:

పొగాకు బోర్డు నిర్దేశించిన కోటాకు మించి పండిన పంటను కూడా వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి కల్పించేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులతో చర్చించి తగిన అనుమతులు ఇప్పించవలసిందిగా రైతులు ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పొగాకు అమ్మకాలు ప్రారంభమై సుమారు ఐదు నెలలు కావస్తోందనీ, తొలినాళ్లలో పొగాకు విక్రయించిన రైతుల కోటాలు ఇప్పటికే పూర్తయ్యాయనీ, అదనపు కోటాల కోసం అనేకమంది రైతులు ఎదురుచూస్తున్నారని రైతులు ఎంపీ కి విన్నవించారు. దీనిపై తప్పకుండా తాను పొగాకు బోర్డుతో, కేంద్ర మంత్రితో మాట్లాడుతానని ఎంపీ హామీ ఇచ్చారు.

### డాప్, యూరియా ప్రత్యేక కోటా:

2026-27 పంట కాలానికి అవసరమైన డాప్ మరియు యూరియా లభించక పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులకు ఈ సందర్భంగా రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పొగాకు రైతులకు ప్రత్యేక కోటా ద్వారా డాప్, యూరియా అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవలసిందిగా రైతులు ఎంపీని కోరారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు తో మాట్లాడతానని హామీ ఇచ్చిన ఎంపీ, రైతులు కూడా మంత్రిని కలిసి సమస్యను వివరించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొగాకు రైతుల సమస్యలపై స్పందిస్తూ రైతు ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఈ సందర్భంగా రైతాంగం తరపున పొగాకు రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఎంపీ ను కలిసిన వారిలో పలువురు పొగాకు రైతులతోపాటు రైతు సంఘాల ప్రతినిధులు వెంట్రప్రగడ శ్రీనివాస్, రవి వర్మ, దుగ్గిరాల బోసు తదితరులు ఉన్నారు.

